సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 31 । ఆగస్టు । 2024



తెలుగు పురస్కారాల్లో వివక్ష
తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన పురస్కారాల్లో రాయలసీమ పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించింది. -8లో



అనంత జట్టు విజయం
ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం జట్టు విజయం సాధించగా, మరో మ్యాచ్ డ్రాగా ముగిసి చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. -8లో

గరిష్టం/కనిష్టం
34.0/26.8

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 26.8 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

నేటి నుంచి జిల్లాలో వైఎస్ జగన్ పర్యటన



కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. 31వ తేదీ ఉదయం 9.30 గంటలకు బెంగళూరు యలహంకలోని తన నివాసం నుంచి బయలుదేరి 9.50 గంటలకు జక్కూరు ఏరోడ్రోమ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి 10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 11.10 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి పెండ్లిమర్రి మండంలోని మాచునూరు గ్రామానికి చేరుకొని అక్కడ ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాచునూరు చంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తారు. మధ్యాహ్నం పార్టీ నేతలను కలుసుకుంటారు. 12.30 గంటలకు మాచునూరు గ్రామం నుంచి బయలుదేరి ఒంటిగంటకు గొందిపల్లె గ్రామానికి చేరుకుంటారు. ఇటీవల కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాచవరం చంద్రహాసరెడ్డి కుమార్తె వివాహం జరిగిన నేపథ్యంలో వారి స్వగృహానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదిస్తారు. 1.30 గంటలకు గొందిపల్లె నుంచి బయలుదేరి 2.15 గంటలకు పులివెందులలోని తన నివాసానికి చేరుకుంటారు. 1వతేదీ ఉదయం 9 గంటల నుంచి పులివెందుల క్యాంప్ ఆఫీసులో ప్రజలకు, పార్టీ నేతలకు అందుబాటులో ఉంటారు. 2వ తేదీ తెల్లవారుజామున 6.20 గంటలకు పులివెందులలోని తన నివాసం నుంచి బయలుదేరి 7 గంటలకు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుంటారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ప్రార్థనలు నిర్వహించి, 7.30 గంటలకు అక్కడి నుంచి బయలు దేరి 7.35 గంటలకు ఇడుపులపాయలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 9.25గంటలకు తాడేపల్లి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 9.40 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

కొప్పర్తికి మహర్దశ!

జిల్లా పారిశ్రామిక ప్రగతి కోసం మహానేత వైఎస్సార్ కన్న కలలు సాకారమవుతున్నాయి. తండ్రి కలలను సాకారం చేయడమే లక్ష్యంగా.. జిల్లాలో నిరుద్యోగాన్ని తరిమికొట్టడమే ఆశయంగా గత ఐదేళ్లలో సీఎం హోదాలో వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి పనులు నేడు ఫలాలనిస్తున్నాయి. రాష్ట్రంలోనే వేల కోట్ల పెట్టుబడులు పెట్టే కేంద్రంగా నేడు కొప్పర్తి పారిశ్రామిక వాడ ముందు వరుసలో ఉంది. వేల మందికి ఉపాధి కల్పించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇదే నిజమైతే త్వరలోనే కడప గడప పారిశ్రామిక ఖిల్లాగా మారనుంది.

- కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.2,147 కోట్లు పెట్టుబడులు
- 54 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి లక్ష్యంగా కేంద్రం అడుగులు
- వైఎస్సార్ ఈఎంసీ అభివృద్ధి కోసం విశేషంగా పనిచేసిన వైఎస్ జగన్ సర్కార్





కొప్పర్తి పారిశ్రామిక వాడ (ఇన్‌సెట్) ఏఐఎల్ డిక్సన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: జిల్లా పారిశ్రామిక ప్రగతి సాధించాలని.. తద్వారా ప్రత్యక్ష ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. అహర్నిశలు శ్రమించారు. తండ్రి కలల్ని సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందడుగు వేశారు. జిల్లాలోని కొప్పర్తిలో మౌళికవసతులు సమకూర్చి పారిశ్రామిక ప్రగతికి అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దారు. వెరసి ఆ కొప్పర్తి పారిశ్రామికవాడ వైపు నేడు కేంద్ర ప్రభుత్వ చూపు పడింది. రూ.2,147కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. 54వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ ఉపాధి లభించేలా ప్రణాళికలు రచిస్తోంది.

- వైఎస్సార్ జిల్లాను పరిశ్రమల ఖిల్లాగా తీర్చిదిద్దాలని కడపకు కూతవేటు దూరంలో అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దాదాపు 6వేల ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పారిశ్రామికవాడకు మౌళిక సదుపాయాలు కల్పించి అందులో డాక్టర్ వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ నెలకొల్పారు. పెద్ద ఎత్తున పెట్టుబడిదారులకు ఆహ్వానం పలుకుతూ లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందడుగు వేశారు. వైఎస్సార్ ఈఎంసీలో రూ.10వేల కోట్లు పెట్టుబడులు, దాదాపు లక్ష మందికి ఉద్యోగాలకు ప్రణాళికలు వేశారు. ఇదివరకే నాలుగు షెడ్లలో ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ ఉత్పత్తి ప్రారంభించింది. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా 1300 మందికి ఉద్యోగాలు లభించాయి. 1.5లక్షల చదరపు అడుగుల సామర్థ్యం ఉన్న మరో మూడు షెడ్లను డిక్సన్ కంపెనీ తీసుకుంది. రెండో ప్లాంట్ విస్తరించేందుకు సిద్ధమైంది. అలాగే డిజికాన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ, సెల్‌కాన్ రిజుల్యూట్, చంద్రహాస్ ఎంటర్ ప్రైజెస్, యూటీఎస్‌పీఎల్ సంస్థలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చాయి. ఈ ఆరు సంస్థలు దాదాపు రూ.600 కోట్లు పెట్టుబడులకు సిద్ధమయ్యాయి. వీటి ద్వారా దాదాపు 7500 ఉద్యోగాలు లభించనున్నాయి. అప్పట్లో వీవీడీఎస్ అనే మరో సంస్థ కూడా ఇక్కడ రూ.365 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ సంస్థ ద్వారా 6400 ఉద్యోగాలు లభించనున్నాయి. బ్లాక్ పెప్పర్, హార్మోనిసిటి అనే మరోరెండు ఎలక్ట్రానిక్ కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఐఏటీ డివైజ్‌లు, ట్యాబ్లెట్ల తయారీ తదితర వస్తువులు ఇక్కడే తయారవుతాయి. వీవీడీఎస్‌సంస్థ 5జీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, బ్లాక్ చైన్, బిగ్ డేటా, ఎనలిటిక్, ఒరిజినల్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ నిమిత్తం ఆయా సంస్థలు సిద్ధమయ్యాయి.

పార్కు సిటీకి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

కొప్పర్తి పారిశ్రామికవాడను పార్కు సిటీగా ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా 12ప్రాంతాల్లో స్మార్ట్ పారిశ్రామికవాడలు నెలకొల్పేందుకు సిద్ధమైంది. అందులో ఆంధ్రప్రదేశ్‌లో కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామికవాడ ఎంపిక చేశారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో రూ.2,147కోట్ల పెట్టుబడులు పెట్టాలనే లక్ష్యంతో ఉన్నట్లు కేంద్రమంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. తద్వారా 54వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు దక్కనున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రులుగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మౌళిక వసతులు అనుకూలతలు అందుకు ప్రత్యక్ష కారణంగా పలువురు చెప్పుకొస్తున్నారు. ఇదే విషయమై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సెమినార్‌లో కొప్పర్తి, ఓర్వకల్లులో అన్నీ అనుకూలతలు ఉన్న విషయాన్ని అప్పటి వైఎస్ జగన్ సర్కార్ వివరించినట్లు సమాచారం. ఆమేరకు పరిశీలనలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పార్కుసిటీగా ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. పైగా కొప్పర్తికి స్టేట్ హైవే, నేషనల్ హైవే, గ్రీన్‌ఫీల్డ్ హైవే, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్‌పోర్టు, కృష్ణపట్నం పోర్టు అందుబాటులో ఉన్నాయి. పైగా చెన్నై, బెంగుళూరు మెట్రోసిటీలకు సమాన దూరంలో ఉండడం మరో అనుకూలతగా పారిశ్రామికవేత్తలు చెప్పుకొస్తున్నారు. ఇన్నీ అనుకూలతలున్న ఈ ప్రాంతం అభివృద్ధి సాధించేందుకు పారిశ్రామికీకరణే శరణ్యమని 2007లోనే దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రహించారు. వైఎస్సార్ ముందుచూపు వల్లే నేడు కొప్పర్తి పారిశ్రామికవాడకు మహర్దశ రాబోతోందని పలువురు కొనియాడుతున్నారు.



నాటి ప్రభుత్వ కృషి ఫలితమే ఈ రిజల్ట్



2020 ఫిబ్రవరి 19న కేంద్ర ప్రభుత్వం నోడ్ సమావేశం నిర్వహించారు. అందులో కొప్పర్తి పారిశ్రామికవాడ విశిష్టత వివరించాం. కేంద్ర ప్రభుత్వం పరిధిలో విశాఖపట్నం, కృష్ణపట్నం, చెన్నై కారిడార్, బెంగుళూరు వయా ఓర్వకల్లు హైదారాబాద్ కారిడార్ మాత్రమే నోడ్ పరిధిలో ఉండేవి. ఆ స్థానంలోకి కొప్పర్తిని చేర్చడంతోనే తాజాగా కేంద్ర ప్రభుత్వం పార్కుసిటీగా కొప్పర్తిని ఎంపిక చేసింది. అప్పటి సీఎం వైఎస్ జగన్ చొరవ వల్లే సాధ్యమైంది. –రాజోలి వీరారెడ్డి, ప్రభుత్వ పరిశ్రమల మాజీ సలహాదారుడు

వైఎస్ ముందుచూపు వల్లే సాధ్యమైంది



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముందుచూపు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి కారణంగానే కేంద్ర ప్రభుత్వం రూ.2,147కోట్లుతో కొప్పర్తిని స్మార్ట్ సిటీగా మార్చేందుకు సాధ్యమైంది. రైల్వే కనెక్టవిటీ, ఎయిర్‌పోర్టు, సమీపంలోనే కృష్ణపట్నం పోర్టు ఇవన్నీ దృష్టిలో పెట్టుకొనే కొప్పర్తి పారిశ్రామికవాడను రూపకల్పన చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ కొప్పర్తికి విశేష ప్రాధాన్యత ఇచ్చింది. –రవీంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

పారిశ్రామిక ప్రగతికి స్పెషల్ జీఓ జారీ

కొప్పర్తి పారిశ్రామికవాడ దినదినాభివృద్ధి చెందడానికి నాటి వైఎస్సార్, నిన్నటి వైఎస్ జగన్ సర్కార్‌లే కారణం. కొప్పర్తి పారిశ్రామిక ప్రగతి కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పెషల్ జీఓ జారీ చేసి పరిశ్రమలను నెలకొల్పే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించారు. 2023–27 కొత్త పాలసీలో ఈ స్పెషల్ జీఓను వర్తింపజేస్తే కొప్పర్తికి మరికొంత ప్రయోజనం. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– జి శేషారెడ్డి, పారిశ్రామికవేత్త

న్యూస్‌రీల్

రేపు ఫుట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు థామస్ జీవన్‌బాబు, కార్యదర్శి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతులతో పాటు 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు.

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆల్పపీడన ప్రభావంతో శుక్రవారం తెల్లవారుజామున, సాయంత్రం జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో అత్యధికంగా పోరుమామిళ్ల మండలంలో 10.2 మి.మీ వర్షం కురిసింది. అలాగే కాశినాయనలో 9.4, రాజుపాలెంలో 4.8, ఒంటిమిట్టలో 3.4, పెద్దముడియంలో 3.2, దువ్వూరులో 1.8, పొద్దుటూరులో 0.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో కురిసిన ఈ వర్షం ఆరుతడి పంటలకు కాసింత ఉపశమనం కలిగించిందని పలువురు రైతులు తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన జనానికి ఈ వర్షం కాసింత ఉపశమనాన్ని కలిగించింది.

జిల్లా ఏఎస్పీగా ప్రకాష్ బాబు

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీలుగా పనిచేస్తున్న వివిధ బ్యాచ్‌లకు చెందిన 30 మందికి అదనపు ఎస్పీలుగా పదోన్నతి కల్పించారు. ఈక్రమంలో ఎన్టీఆర్ కమీషనరేట్ పరిధిలో మహిళా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా ఉన్న కె. ప్రకాష్‌బాబుకు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించడంతో పాటు కడప జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. జమ్మలమడుగు డీఎస్పీగా పనిచేస్తున్న జి. హుసేన్ పీరాకు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలనీ ఆదేశాలిచ్చారు.

పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతం

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో శుక్రవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో రాయలసీమ జిల్లాల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు, ఆఫీసు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 10 మందికి గాను 8 మంది పదోన్నతులు పొందారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగుల సీనియారిటీ, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని పదోన్నతులు కల్పించామని తెలిపారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ వెంకట సుబ్బమ్మ, సీనియర్ అసిసెంట్లు రవి కుమార్, వనీషా పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్



ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయంలో శుక్రవారం గ్రేడ్-2 ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి మొత్తం 136 మంది ఆన్‌లైన్ ద్వారా బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 122 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. పర్యవేక్షక ఇంజినీరు జీవీ. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ బదిలీల దరఖాస్తుకు సంబంధించి ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద 28 మంది ఉన్నారన్నారు. వీరిలో ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ ఇద్దరు, మెడికల్ గ్రౌండ్స్ కింద ఆరుగురు, స్పౌజ్ 12, మీచువల్ 8 మంది ఉన్నారని తెలిపారు. మిగతా 108 మంది ఇతరులు ఉన్నట్లు వివరించారు. కలెక్టర్ల ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా నుంచి వైఎస్సార్ జిల్లాకు ఎంతమంది ఉద్యోగులు బదిలీ అయ్యారో అంతే మందినివైఎస్సార్ జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశామని వెల్లడించారు. రెండు జిల్లాల్లో ఉద్యోగుల కొరత రాకుండా ఈ పద్ధతి పాటిస్తున్నామన్నారు. ప్రభుత్వం బదిలీల గడువును వచ్చేనెల 15వ తేది వరకు పొడిగించడంతో బదిలీ ఉత్తర్వులను తర్వాత అందజేస్తామన్నారు. అంతకుముందు బదిలీల దరఖాస్తులు, సర్టిఫికెట్లను ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, అన్నమయ్య జిల్లా పీఆర్ ఇంజనీరింగ్ అధికారి దయాకర్ రెడ్డి, పీఆర్ సిబ్బంది పరిశీలించారు.

హెడ్ నర్స్‌లకు పదోన్నతి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం రాయలసీమ జిల్లాల పరిధిలో హెడ్ నర్స్‌లకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా నలుగురికి పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వై. శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడిగా విజయభాస్కర్



కడప కల్చరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడిగా తనను నియమించినట్లు కడప నగరానికి చెందిన విశ్రాంత సీనియర్ బ్యాంకు మేనేజర్ జానమద్ది విజయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయ విభాగం కార్యదర్శి వి.సునీత జీఓ జారీ చేశారని ఆయన వివరించారు. జానమద్ది విజయభాస్కర్ 2016లో బ్యాంకు అధికారిగా ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం కడప నగరంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యుడిగా ఐదేళ్లపాటు సేవలు అందించారు. పేదలకు న్యాయ సహాయం అందించడంతోపాటు సభలు, సమావేశాలు నిర్వహించారు. 2021లో శాశ్వత లోక్ అదాలత్ సభ్యునిగా ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుతం కడపజిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడిగా నియమించింది. ఈ పదవిలో ఈయన రెండేళ్లపాటు కొనసాగుతారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, జిల్లా పోలీసు సర్వోన్నత అధికారులు సభ్యులుగా ఉండే ఈ సంస్థలో జానమద్దితోపాటు మరో ఇద్దరు సభ్యులు ఉంటారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీ అవినాష్‌తో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ



ఎంపీ అవినాష్‌రెడ్డితో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు

కడప కార్పొరేషన్: కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డితో జిల్లాలోని పార్టీ ముఖ్య నేతలు సమావేశమయ్యారు. శుక్రవారం స్థానిక ఎంపీ అతిథి గృహంలో వారు సమావేశమై ప్రస్తుత రాజకీయాల గురించి చర్చించారు. జిల్లాలో టీడీపీని ఎదుర్కోవడానికి, వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన ప్రణాళికల గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, కడప మేయర్ కె. సురేష్ బాబు, జెడ్పీ చైర్మన్ అభ్యర్థి రామగోవిందరెడ్డి పలువురు జెడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కీలకం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు



మొక్క నాటి నీరు పోస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

- ప్రతి ఒక్కరూ మొక్కను నాటి బాధ్యతగా సంరక్షించాలి
- వన మహోత్సవంలో జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

వైవీయూ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయం ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం-2024 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత కలెక్టర్, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వం వన సంపద ఎంతో ఉండేదని, ప్రస్తుతం వన సంరక్షణ లేకుండా పోతోందని విచారం వ్యక్తం చేశారు. ఈ యేదాది అమ్మ పేరు మీద మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. వాతావరణంలో సమతుల్యం లేనప్పుడు ఏకైక మార్గం మొక్కలు నాటడమేనన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది 8 లక్షల మొక్కలను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, విద్యాసంస్థల్లో విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. భవిష్యత్తులో వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ అతిది సింగ్ మాట్లాడుతూ రాష్ట్రం మొత్తంలో ఈరోజు అమ్మ పేరుపై మొక్కలు నాటడం జరుగుతోందని, ఇది ఎంతో సంతోషించ దగ్గ విషయమన్నారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాటిని సంరక్షించాలని అన్నారు. జమ్మలమడుగు శాసన సభ్యుడు ఆదినారాయణ రెడ్డి, మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్, కమలాపురం శాసనసభ్యుడు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. వనమహోత్సవం వల్ల ఎంతో ప్రయోజనం ఉందని చెప్పారు. కడప డీఎఫ్ఓ సందీప్ రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో వన మహోత్సవం-2024 విజయవంతం చేస్తున్నామన్నారు. ఎర్రచందనం ఈ ప్రాంతంలో లభించడం జిల్లాకు ఎంతో గర్వకారణమన్నారు. జిల్లాను పచ్చ తోరణాలతో నింపుతామని నగరాన్ని సుందర నగరంగా చేస్తామని చెప్పారు. అనంతరం ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు 'వన సంరక్షణపై అందరం ఈ హరిత యజ్ఞంలో పాలుపంచుకొందాం... ప్రతి ఇల్లు, ప్రతి ఊరు పచ్చదనంతో సింగారిద్దాం'అంటూ ప్రతిజ్ఞ చేశారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, టీడీపీ నాయకులు సి. భూపేష్ రెడ్డి, పి. లక్ష్మీరెడ్డి, జనసేన నాయకుడు సుంకర శ్రీనివాస్, కడప మున్సిపల్ కమిషనర్ నందన్, డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుకింగ్ కేంద్రాల్లో సజావుగా ఇసుక పంపిణీ: కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియను జిల్లాలో నిర్దేశించిన బుకింగ్ కేంద్రాల్లో సజావుగా చేపడుతున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం అన్ని జిల్లాల స్టాక్ యార్డుల వద్ద ఇసుక పంపిణీ, వినియోగదారుల సంతృప్తి, ట్రాన్స్‌పోర్టుపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక రేవులు, స్టాక్ పాయింట్ల వద్ద వాహనాల రద్దీ లేకుండా చూడాలన్నారు. ఇసుక లభ్యత వినియోగంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉంచి.. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక లభ్యత వివరాలను విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇసుక వినియోగంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి వివరాలు నివేదించాలని ఆయన సూచించారు. ఇసుక పంపిణీ ప్రక్రియ నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

క్లుప్తంగా

ఘర్షణ కేసులో ఐదుగురు అరెస్టు

చాపాడు : మండలంలోని లక్ష్మీపేటలో జరిగిన ఘర్షణ కేసులో లక్ష్మీపేటకు చెందిన వరికూటి గురివి రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డిలతోపాటు మరో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. వీరభద్రాపురం వద్దగల 22 సెంట్ల భూమి విషయంలో బుధవారం అర్ధరాత్రి ఘర్షణ జరిగిన సంగతి విదితమే. ఈ విషయంలో గాయపడిన వారి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఉద్యోగాల పేరుతో డబ్బు వసూలు

ధర్మవరం రూరల్ : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటు నమ్మబలికి నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న ఉపేంద్ర అనే వ్యక్తిని శుక్రవారం నిరుద్యోగులు బంధించి ధర్మవరం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. బాధితులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన వడ్డే ఉపేంద్ర ధర్మవరంలోని మారుతీ నగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి నరేష్‌తో పరిచయం పెంచుకున్నాడు. తనకు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు తెలుసునని ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నరేష్ నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేశాడు. డబ్బు తీసుకున్న అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ధర్మవరం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఉపేంద్రను గుర్తించిన బాధితుడు నరేష్ వెంటనే తన బంధువుల సాయంతో బంధించి పోలీసులకు అప్పగించాడు. తనతో పాటు మరో 20 మందిని ఉపేంద్ర మోసగించి డబ్బు తీసుకున్నాడని బాధితుడు తెలిపాడు. ఉపేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

నిబంధనల మేరకే బకాయిల వసూళ్లు

– డీసీసీ బ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప



మాట్లాడుతున్న డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధిలో నిబంధనల మేరకే.. బకాయిలు వసూలు చేయాలని డీసీసీ బ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప ఆదేశించారు. కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాయిదా మీరిన బకాయిదారులకు చట్టం ప్రకారం తాఖీదులు జారీ చేయాలన్నారు. బకాయిదారులను సూపర్ వైజర్ ప్రత్యేకంగా కలిసి వేలం గురించి వివరించాలని తెలిపారు. బకాయిలు చెల్లించకపోతే వారి స్థిరాస్తుల వేలానికి చర్యలు తీసుకోవాలన్నారు. డీసీసీ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్లు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏజీఎంలు నారాయణరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలనీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 08562-258622, 244622లో సంప్రదించాలన్నారు.

తెలుగు పురస్కారాల్లో వివక్ష

- తెలుగు భాషా పురస్కారాల్లో 'సీమ' పట్ల వివక్ష
- ప్రాంతీయ విద్వేషాలు పెంచుతున్న ప్రభుత్వ తీరు
- ఆ జిల్లాలకే ఇవ్వడంతో 'సీమ' వాసుల ఆగ్రహం

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన పురస్కారాల్లో రాయలసీమ పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించింది. చిత్తూరు జిల్లాలో ఇద్దరికి పురస్కారాలు అందించి మిగతా రాయలసీమ జిల్లాలకు మొండి చేయి చూపింది. ఆ ఇద్దరు కూడా కొత్తవారు కాదని, గతంలో పురస్కారాలు పొందిన వారేనని తెలుస్తోంది.



కడప సెవెన్‌రోడ్స్ : వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా యేటా ఆగస్టు 29న రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. తమ రచనల ద్వారా తెలుగుభాషా వికాసానికి కృషి చేసిన వారికి పురస్కారాలు అందించి గౌరవిస్తుంది. సాధారణంగా రాష్ట్ర సాంస్కృతికశాఖ ముందుగా ఒక ఎంపిక కమిటీని ఏర్పాటుచేసి కలెక్టర్ల ద్వారా సమాచారం సేకరిస్తుంది. గతంలో పురస్కారాలు పొందిన వారు ఉంటే వారి పేర్లు తొలగిస్తుంది. ఈ ఏడాది తోలు బొమ్మలాట, డ్రామా, ఆంధ్ర నాట్యం, వయోలిన్, ఓకల్ కర్నాటిక్, పెయింటర్, సంగీతం, అశోక్ బుక్ సెంటర్లకు సంబంధించిన వ్యక్తులకు పురస్కారాలు అందజేశారు. నిబంధనలు పాటించకుండా అప్పటికప్పుడు తమకు కావాల్సిన వారి పేర్లతో జాబితా రూపొందించి అవార్డులు అందజేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 19 మందికి అవార్డులు అందించగా రాయలసీమలోని చిత్తూరు జిల్లాలో ఇద్దరే ఉన్నారు. ఇందులో కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు 15 మంది ఉండగా, ప్రకాశం, విజయనగరం జిల్లాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. మిగిలిన పురస్కారాలన్నీ కోస్తా జిల్లాలకు పంచి పెట్టడంతో ఈ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా అప్పటికప్పుడు తమకు కావాల్సిన వారి పేర్లతో జాబితా తయారు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాకుళం, విశాఖపట్టణం, నెల్లూరు జిల్లాలకు అవకాశం లభించలేదు.

సీట్లిచ్చిన 'సీమ'కు...

తనకు అత్యధిక స్థానాలు కట్టబెడితే రాయలసీమ జిల్లాలకు ఏదైనా మేలు చేసేందుకు అవకాశం ఉంటుందని ఎన్నికల ముందు పలు సందర్భాల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాట్లాడిన విషయం అందరికీ తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నడూలేని విధంగా 52 శాసనసభ స్థానాలకుగానూ 45 స్థానాలు, ఎనిమిది లోక్‌సభ స్థానాలకుగానూ 5 స్థానాలు టీడీపీకి కట్టబెట్టారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమరావతి, కోస్తాంధ్ర జిల్లాలు మినహా ఈ ప్రాంతం గురించి పట్టించుకోవడం లేదని, అందుకు తెలుగుభాషా పురస్కారాల విషయమే నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రాంతీయ సమతుల్యత లేదు



భాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన పురస్కారాలను పరిశీలిస్తే ప్రాంతీయ సమతుల్యత పాటించలేదనే విషయం స్పష్టమవుతోంది. హడావుడిగా అప్పటికప్పుడు ఒక జాబితా తయారుచేసి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో ఏమాత్రం పారదర్శకత పాటించలేదు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం అవుతుంది. ప్రాంతాల మధ్య విబేధాలు పెంచేందుకు దోహదం చేస్తుంది. ఇలాంటి సంప్రదాయం గతంలో ఎన్నడూ లేదు.

– ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

'సీమ, ఉత్తరాంధ్ర'ను విస్మరించారు



తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలను పూర్తిగా విస్మరించింది. ముఖ్యంగా తెలుగు పుట్టుకను తెలిపిన రాయలసీమపై వివక్ష చూపింది. ప్రాచీన సాహిత్యానికి, సాహితీ విమర్శకు పుట్టినిల్లు, తెలుగు నేడు బ్రతికి ఉందంటే అందుకు ప్రధానమైనది రాయలసీమ. అలాగే ఆధునిక సాహిత్యంలో ఉవ్వెత్తున ఎగిసిపడిన సాహిత్యమంతా ఉత్తరాంధ్ర నుంచి వచ్చింది. ఈరెండు ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రక్కన పెట్టడంలో ఉద్దేశమేమిటో చెప్పాలి. పక్షపాత ధోరణితో వ్యవహరించడం సమంజసం కాదు.

– డాక్టర్ తవ్వా వెంకటయ్య, పూర్వ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం, కడప

ముమ్మాటికీ వివక్షే



తెలుగుభాషా దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన అవార్డుల జాబితాను పరిశీలిస్తే సీమ పట్ల వివక్ష స్పష్టంగా కనిపిస్తోంది. తెలుగుభాష కోసం కృషి చేస్తున్న ఎంతో మంది రాయలసీమలో ఉన్నప్పటికీ అందరినీ విస్మరించి కొన్ని జిల్లాలకే ప్రాధాన్యత ఇవ్వడం తగదు. ఇది రాష్ట్ర సమైఖ్యతను దెబ్బతీస్తుంది.

– ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, అధ్యక్షులు, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం

అనంత జట్టు విజయం

చిత్తూరు, నెల్లూరు మ్యాచ్ డ్రా



రోహిత్ రోషన్ (103 పరుగులు)



చరణ్‌జీత్ (125 పరుగులు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం జట్టు విజయం సాధించగా, మరో మ్యాచ్ డ్రాగా ముగిసి చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 84 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 47 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి విజయానికి అవసరమైన 195 పరుగులు చేయడంతో అనంతపురం జట్టు విజయం సాధించింది. జట్టులోని రోహిత్ ఓషన్ 103 పరుగులతో నాటౌట్‌గా నిలువగా, మహేంద్రారెడ్డి 33 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు సాబ్జాన్ బాషా 3, సుశాంత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 182 పరుగులు చేయగా, అనంత జట్టు 199 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 206 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనంతపురం జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

చిత్తూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 420 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు చివరి రోజు 451 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని చరణ్‌జీత్ 125 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు భార్గవ్ 4, నారాయణ 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 48 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.అబ్బాస్ 69 పరుగులు చేయగా, ఎస్.కె.బాజీ 91 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చిత్తూరు బౌలర్ అచ్యుతానంద 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 280 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

గండికోట జలాశయం పరిశీలన



గండికోట జలాశయం వద్ద అధికారులు

కొండాపురం : గండికోట జలాశయాన్ని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎన్‌డబ్ల్యూడీఏ) ఢిల్లీ సీఈ దేవేందర రావు, డిప్యూటీ డైరెక్టర్ లలిత పరిశీలించినట్లు జలవనరుల శాఖ డీఈ ఉమామహేశ్వర్లు శుక్రవారం తెలిపారు. గండికోట జలాశయం కెపాసిటీ ఇక్కడ నుంచి ఎక్కడికి నీటిని తరలిస్తారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గండికోటనుంచి మైలవరం జలాశయానికి 15 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లుతున్నట్లు తెలిపారు. జిఎన్‌ఎస్‌ఎస్ శెట్టివారిపల్లె హెడ్ రెగ్యులేటరీ నుంచి ప్రధాన కాలువ ద్వారా వామికొండకు 200, సర్వరాయ సాగర్‌కు 300 క్యూసెక్కులు పంపిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జలవనరుల శాఖ అధికారులు రవికిరణ్ ఎఈలు చంద్రశేఖర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

కడప మున్సిపల్ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మెన్‌గా శైలజ



చైర్మెన్, వైస్ చైర్మెన్‌లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్‌ఎం నాగమణి

కడప ఎడ్యుకేషన్ : కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో శుక్రవారం ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించి ఏర్పాటు చేశారు. ఉదయం పాఠశాల ప్రారంభం నుంచే తల్లిదండ్రులు హాజరుకాగా, కోరం రాగానే 6 నుంచి 10వ తరగతి వరకు తరగతుల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి చెతులెత్తే పద్ధతిలో డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అనంతరం చైర్మెన్, వైస్ చైర్మెన్‌లను ఎన్నుకున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్‌గా వడుగు శైలజ ఎంపిక కాగా వైఎస్ చైర్మెన్‌గా వడ్లపల్లి ఉమనాగమణిలను ఎన్నుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు నాగమణి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. మధ్యాహ్నం ఎస్‌ఎంసీ సమావేశాన్ని నిర్వహించి భవిషత్తు కార్యక్రమాలు, అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంఈఓ గంగిరెడ్డి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు చల్లా విశ్వనాథరెడ్డి, మిట్టా కేశవరెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

గతంలో కోరం లేక...

మునుపు ప్రభుత్వం ప్రకటించిన తేదీలలో మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ సజావుగానే జరిగింది. అయితే కొంతమంది ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో ఎన్నికలను రద్దు చేయించింది. తరువాత అధికారులు ఈ నెల 17వ తేదీన ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. కోరం లేక నిర్వహణ అగిపోయింది. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో 1348 మంది తల్లిదండ్రులకుగాను 750 మంది హాజరు కావడంతో ఎన్నిక జరిగింది.

పులివెందుల కేంద్రంగా అక్రమ మద్యం

ఐచర్ వాహనంలో భారీగా పట్టివేత



వాహనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పులివెందుల కేంద్రంగా అక్రమ మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున అక్రమ వాహనాల్లో మద్యం తరలిస్తున్నా.. అరికట్టాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గురువారం సాయంత్రం గోవా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని స్థానిక రాయలాపురం వద్ద పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. అయితే ఇక్కడే అసలు విషయం పక్కదారి పట్టింది. పోలీసులు పట్టుకున్న ఐచర్ వాహనంతో పాటు ముందు మరో ఐచర్ వాహనం వచ్చినట్లు తెలిసింది. ఒక వాహనాన్ని పోలీసులు పట్టుకోగానే దాని వెనుక మద్యంతో వస్తున్న మరో వాహనాన్ని తెలుగు తమ్ముళ్లు దారి తప్పించినట్లు తెలుస్తోంది. పోలీసులు పట్టుకోకుండా అధికార పార్టీ నాయకులు తీవ్ర ఒత్తిడి చేసినట్లు సమాచారం. డీఎస్పీ మురళీనాయక్ వివరణ కోరగా అక్రమ మద్యంతో వస్తున్న ఒకే వాహనాన్ని వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నామని, మరో వాహనంలో మద్యం వస్తున్న విషయం అవాస్తవమన్నారు. కొంతమంది వ్యక్తులు అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఇలాంటి పనిచేస్తున్నారని... ఎలాంటి రాజకీయ నాయకులకు, పార్టీలకు కానీ సంబంధం లేదని తెలిపారు.

యూపీఎస్‌ను అంగీకరించేది లేదు

– యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా



డీఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) పథకాన్ని అంగీకరించేది లేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదనవిజయకుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అసంబద్ధ పనిసర్దుబాటు విధానాన్ని నిరసిస్తూ కడప డీఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చిందని ఆరోపించారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడంలో అసలు మోసం దాగి ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. సర్దుబాటు ప్రక్రియను మండల పరిధి వరకే పరిమితం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వై.రవికుమార్, కె.నరసింహారావు, చంద్రశేఖర్, గాజులపల్లె గోపీనాథ్, కృష్ణారెడ్డి, ఎం.సి.నాగన్న, తదితరులు పాల్గొన్నారు

రైల్వే సమస్యలపై జీఎంకు మిథున్‌రెడ్డి లేఖ



మిథున్‌రెడ్డి, ఎంపీ

రాజంపేట : రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో విస్తరించబడిన రైల్వేల ప్రగతికి సంబంధించిన అభివృద్ధి, సౌకర్యాలు, రైళ్ల స్టాపింగ్, ఆర్‌యూబీ నిర్మాణాల అంశాలపై దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకేజైన్‌కు శుక్రవారం రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ.మిథున్‌రెడ్డి లేఖ వ్రాసారు. అక్టోబరు 4న విజయవాడలో ఎంపీలతో రైల్వే శాఖ మీటింగ్ ఉండడంతో ప్రధానంగా నందలూరు, రాజంపేట, పీలేరు, ఓబుళవారిపల్లె రైల్వే స్టేషన్ల అంశాలను ఆయన లేఖలో ప్రస్తావించారు.

ప్రతిపాదిత అంశాలు

- రైల్వేకోడూరులో రూ.5 కోట్లతో చేపట్టిన ఆర్‌యూబీ పనులు పూర్తిచేయాలి
- తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలి
- నందలూరు రైల్వే పరిధిలోని ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలి. రైల్వే క్రూసెంటర్‌ను బలోపేతం చేయాలి.
- నందలూరులో పలు రైళ్లకు వాటరింగ్ ఏర్పాటు చేయాలి.స్టేషన్ పరిధిలోని రన్నింగ్ రూం ఆధునికీరణ పూర్తి చేయాలి.
- ఒంటిమిట్ట రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి. అన్ని సౌకర్యాలు కల్పించాలి.
- నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె , రైల్వేకోడూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ పునరుద్ధరించాలి.
- రాజంపేటలో హరిప్రియ, ఏపీ సంపర్క్ క్రాంతి, చెంగల్పట్ ఎక్స్‌ప్రెస్, ఓబులవారిపల్లె, నందలూరులో వెంకటాద్రి స్టాపింగ్ ఏర్పాటు చేయాలి. నందలూరులో జయంతి, రాయలసీమ, చెన్నై-ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి.
- పీలేరు రైల్వే స్టేషన్‌లో నాగర్‌కోయిల్ హాల్టింగ్, కలికిరి రైల్వే స్టేషన్‌లో అమరావతి ఎక్స్‌ప్రెస్, పీలేరులో కాచిగూడ-మధురై, ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ కల్పించాలి.
- వాయల్పాడులో 17245, 12731, 16340, 17248 నెంబర్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలి.
- బ్రిటీష్ కాలం నాటి రెడ్డిపల్లె రైల్వే స్టేషన్‌లో అరకోణం, ఇంటర్ సిటీ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి.
- పీలేరు రైల్వే స్టేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలి. రైలు ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించాలి.
- తిరుపతి-పాకాల-కదిరి-ధర్మవరం మీద ఉదయం ప్యాసింజర్ (డెమో)రైలు నడిపించాలి.
- వాయల్పాడు రైల్వేస్టేషన్ పేరు వాల్మీకపురం స్టేషన్‌గా మార్చాలి.

నేటి నుంచి పాఠశాలల్లో స్వచ్ఛత పఖ్వాడా



కడప భగత్‌సింగ్ కాలనీ మండల ప్రాథమిక పాఠశాల

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయి నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం శనివారం నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు నిర్వహించనుంది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులతో కలిసి పిల్లలకు, గ్రామస్థులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్వచ్ఛత గురించి పిల్లలకు తెలిపి ప్రతిజ్ఞ చేయించేందుకు ఆగస్టు 31వ తేదీన స్వచ్ఛత శపత్ దినం నిర్వహిస్తారు.

- పారిశుద్ధ్యం, చేతులు కడుక్కోవడం, వంటగది, ఫంకాలు, తలుపులు ఇతరత్రా శుభ్ర పరిచే విధానంపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 2, 3వ తేదీలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తారు.
- నీటి వృథా, నీటి సంరక్షణ, జలశక్తి అభియాన్‌పై వివిధ ప్రాంతాల్లో సెప్టెంబరు 4 ,5వ తేదీలలో ప్రచారం ద్వారా అవగాహన కల్పిస్తారు.
- ప్లాస్టిక్ నిర్మూలించడం మెదలైన వాటిపై నినాదాలు, పోస్టర్స్, కర పత్రాలు 6వ తేదీ గ్రీస్‌స్కూల్ డ్రైవ్ డే...నిర్వహిస్తారు.
- సెప్టెంబరు 7న పాఠశాలల్లో పరిశుభ్రత, స్వచ్ఛతపై పిల్లలకు వకృత్వ, క్విజ్, పెయింటింగ్ పద్యాల పోటీలు నిర్వహిస్తారు.
- సెప్టెంబరు 9, 10వ తేదీలలో హ్యాండ్ వాస్‌పై అవగాహన కల్పిస్తారు. నీటి ద్వారా సక్రమించే వ్యాధులపై అవగాహన కల్పిస్తారు.
- సెప్టెంబరు 11న వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం నిర్వహిస్తారు. విద్యార్థుల గోళ్లను కత్తిరించడం, శుభ్రమైన నీటితో స్నానం చేయడం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారు.
- సెప్టెంబరు 12న పాఠశాలల్లో విద్యార్థులచే పారిశుద్ధ్య అంశాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తారు.
- సెప్టెంబరు 13, 14వ తేదీలలో పాఠశాలల్లో స్వచ్ఛతపై ప్రణాళిక, 15న పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమాలు ఉంటాయి.

స్వచ్ఛత, పరిశుభ్రతపై.. అవగాహన



పాఠశాలల్లో స్వచ్ఛత, పరిశుభ్రత ఎంతో ముఖ్యం. ఇందుకోసమేఏటా పాఠశాల్లో స్వచ్ఛతా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. స్వచ్ఛత, పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన, ర్యాలీలు, క్విజ్‌లు, వకృత్వ పోటీలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలి.

– మిట్టా కేశవరెడ్డి, సిఎంఓ, సమగ్రశిక్ష

అన్ని పాఠశాలల్లో తప్పనిసరి...



జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలి. ఆయా తేదీల షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పిల్లలతో నిర్వహించాలి. ఎవరూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదు.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

నేడు గండిలో గ్రామోత్సవం

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రం గండిలో శ్రావణ శనివారం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో వచ్చే భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మెన్ కావలి కృష్ణతేజ, పాలకమండలి సభ్యులు తెలిపారు. కాలక్షేపం నిమిత్తం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రద్దీ అధికంగా ఉంటుందని భావించి అందుకు తగిన విధంగా లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతలచే పెద్ద ఎత్తున అన్నదానం, నీటి వసతి కల్పించామన్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున క్షేత్రోత్సవం జరుగుతుందని, స్వామి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించిన ప్రత్యేక పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తారని, అనంతరం పాపాఘ్ని నదిలో జరిగే ఆస్థానంతో ఉత్సవాలు ముగిస్తామని వారు పేర్కొన్నారు.

భద్రత కట్టుదిట్టం: సీఐ

భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేసినట్లు ఆర్కేవ్యాలీ సీఐ నాగరాజు, ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసులు, మహిళా పోలీసులు, హోంగార్డులతో కలిపి సుమారు 250 మందితో బందోబస్తు నిర్వహిస్తారని చెప్పారు. వాహనాలను గండిలోకి అనుమతించమని ఆయన తెలిపారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన గురువారం రాత్రి పట్టణంలో జరిగింది. ఎస్టేట్‌లో నివాసముంటున్న వినయ్ కుమార్(22), మాధవి(19) దంపతులు ఆరు నెలల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఎస్టేట్‌లో ఉంటూ స్థానిక పరిశ్రమల్లో పని చేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల కొంతకాలంగా మాధవి పుట్టినింటివారు ఆమెను ఇంటికి వచ్చేయమని ఒత్తిడి చేశారు. ఈ విషయమై గురువారం రాత్రి భార్యా భర్తలు గొడవపడ్డారు. మనస్తాపం చెందిన వినయ్‌కుమార్ పురుగు మందు తాగి మొదట ఆత్మహత్యకు ప్రయత్నించగా, ఆ వెంటనే భార్య మాధవి అదే పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు దంపతులు ఇద్దరినీ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నారు.

లారీ ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలో శుక్రవారం ఎంజీపురం(రాజంపేట) క్రాస్ వద్ద స్కూటరిస్టును లారీ ఢీకొంది. గాయపడిన సుబ్బరాయుడు చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. స్కూటరిస్టును ఢీ కొట్టిన లారీ నిలబెట్టకుండా వెళ్లిపోయాడు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండ్లూరు వద్ద ఆటో, బైకు ఢీ

గుండ్లూరు వద్ద హైవేలో నడి రోడ్డులో ఆటోబోల్తా పడింది. ఆటో, బైకు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు చికిత్సకోసం రెఫర్ అయ్యారు. ఈ ప్రమాదంపై మన్నూరు పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.